క్లుప్తంగా

నేడు మెగా కంటి వైద్య శిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహించనున్నట్టు నవజీవన్ ఆశ్రమ నిర్వాహకురాలు, ఐఆర్‌డీఎస్ ట్రెజరర్ చిన్నమ్మలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవజీవన్ ట్రస్ట్ తిరుపతి వారి ఆర్థిక సాయంతో ఐఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్టు, అవసరమైతే అదే రోజున ఆస్పత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించనున్నట్టు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

మాతృభాష గొప్పది

సాలూరు: మాతృభాష చాలా గొప్పదని డీఈఓ రమణ అన్నారు. మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎమ్ సింహాచలం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. మనం ఏ స్థాయికి ఎదిగి, ఎక్కడ స్థిరపడినా మాతృభాషను మరిచిపోరాదని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్, విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ, ఏఎంఓ శ్రీనివాసరావు, మోహనరాయుడు, ఏటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రాజ్‌కుమార్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆదయ్య, అప్పారావు, అప్పన్న పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ రెవెన్యూ అధికారి డి. రోబెన్



యూజర్ చార్జీలను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా యూజర్ చార్జీలు చెల్లించి పట్టణాభివృద్ధికి కృషిచేయాలని మున్సిపల్ రెవెన్యూ అధికారి డి. రోబెన్ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో వన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్‌చార్జీలు చెల్లించడం వల్ల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధులు సమకూరుతా యన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకే వైద్య సేవలు



కృష్ణపల్లిలో వృద్ధురాలి ఇంటి దగ్గర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి కృష్ణంరాజు

పార్వతీపురం టౌన్: గ్రామాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందజేస్తున్నట్లు వైద్యాధికారి కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15రోజులకోసారి నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరంలో 14రకాల వైద్యపరీక్షలను చేస్తున్నట్లు చెప్పారు. 62రకాల మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ సొసైటీలో చేరండి

బలిజిపేట: అర్హులైనవారు ఏపీ ఓపెస్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్‌మీడియట్ విద్య చదువుకోవచ్చని బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఇంటర్‌మీడియట్ విద్య ఏపీఓఎస్ఎస్ ద్వారా చదువుకునేందుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఇంటర్‌మీడియట్‌లో చేసి ప్రథమ సంవత్సరం ఫెయిలై కళాశాలను విడిచి వెళ్లిపోయినవారు, ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయినవారు ఈ కోర్సులో జాయిన్ అయ్యేందుకు అర్హులని తెలిపారు. ఈనెల 27వ తేదీ లోపల జాయిన్ కావాలని సూచించారు. పరీక్ష రుసుము వచ్చేనెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలు ఏప్రిల్ నెలలో జరుగుతాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమ్మ భాష అమృతం

పాలకొండ రూరల్: అమ్మ భాష అమృతం వంటిదని అంపిలి పాఠశాల హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వం, ప్రజల నడుమ వారధులు

గృహ సారథులే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి గృహ సారథులు పని చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పురపాలక సంఘంలోని 6వ సచివాలయం పరిధిలో గృహ సారథులతో స్థానిక దేవాంగుల సంక్షేమ భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా సేవ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్ల ద్వారా కొత్తగా నియమితులైన గృహ సారథులను పరిచయం చేసుకుని జగనన్న కుటుంబంలో సభ్యులుగా చేరినందుకు వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరిశ్వరి, వైస్‌చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవ రావు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికీ తెలపండి

బలిజిపేట: ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తిరిగి వెళ్లి వివరించి పార్టీ పటిష్టానికి గృహసారథులు, కన్వీనర్లు పాటుపడాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. మండలంలోని సుభద్ర సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 18వ తేదీ నుంచి గృహసారథులు ఇంటింటికీ తిరిగి 'జగన్ అన్నే మా భవిషత్తు' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను వివరించి రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని ప్రజలకు తెలియపరచాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీటీసీ లత, సర్పంచ్‌లు విజయ, సుందరరావు, ఆర్ శ్రీనివాసరావు, సింహాచలం నాయుడు, కె.ఉమామహేశ్వరరావు, కె.కృష్ణ, పి.నారాయణరావు, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ పర్యవేక్షణలో స్పందన దరఖాస్తుల పరిష్కారం

సీతానగరం: మండలంలోని వివిధ శాఖలకు ప్రజల నుంచి వచ్చిన స్పందన దరఖాస్తులు కాలపరిమితి దాటకుండా పరిష్కరించడానికి మండల స్థాయి అధికారుల కమిటీ సమన్వయంతో పనిచేస్తుందని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రభుత్వం నిర్దేశించిన కమిటీ ప్రతినిధులు హెచ్‌డీ షేక్ ఇబ్రహీం, ఏఓ ఎస్.అవినాష్, ఎస్సై కె. నీలకంఠం, వైద్యాధికారి ఆశాలతలతో సమావేశం జరిగింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి వచ్చిన స్పందన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం మండల స్థాయి అధికారులతో కమిటీ వేసిందన్నారు. స్పందన దరఖాస్తుస్తును పరిష్కరించినప్పటికీ అర్జీదారుల సంతృప్తి చెందేవిధంగా అవగాహన కల్పించడానికి కమిటీ ప్రతినిదులు కృషి చేయాల్సి ఉందన్నారు. ఏ శాఖ నుంచి స్పందన దరఖాస్తు వచ్చినా నిర్దేశించిన మండల కమిటీ అధికారులు సమన్వయంతో పని చేయాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమావర్మ, సీహెచ్‌వో, హెల్త్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ



కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినిలతో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

పాచిపెంట: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, కేజీబీవీ మినీ గురుకులం పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బాలల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజన మెనూ పరిశీలించి, ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏంఈఓ పల్లి జోగారావు, ఏసీడీపీఓ ఏస్తేరురాణి తదితరులు ఉన్నారు.

ఓటర్ల గుర్తింపుపై కసరత్తు

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల గుర్తింపు కోసం కసరత్తు చేస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓటర్ల గుర్తింపు కసరత్తు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని చెప్పారు. పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీ అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఓటర్ల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పాలవలసను కలిసిన నర్తు

పాలకొండ:

స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైన నర్తు రామారావు మంగళవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరంను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ వేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు. రాజశేఖరంతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు నర్తు రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు.



పాలవలస రాజశేఖరంతో మాట్లాడుతున్న నర్తు రామారావు

24న పైడిమారమ్మ వనంగుడి ప్రతిష్ట

కురుపాం:

మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఈ నెల 23, 24వ తేదీల్లో శ్రీపైడిమారమ్మ అమ్మవారి వనం గుడి ప్రతిష్టా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గుడి నిర్మాణకర్తలు దాత కొత్తకోట వెంకటసురేష్‌కుమార్ దంపతుల చేతులమీదుగా ఈ ప్రతిష్టా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. 23న ఉదయం 8గంటల నుంచి హోమం, 24న ప్రతిష్టా కార్యక్రమం, 12 గంటల నుంచి అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కురుపాంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉత్సవంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



పైడిమారమ్మ తల్లి వనం గుడి

ధాన్యం సేకరణకు పెరిగిన టార్గెట్

సీతానగరం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులధాన్యం కొనుగోలు జరుగుతోందని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుల కళ్లాల్లో ధాన్యం నిల్వలున్నట్టు ఇటీవల గుర్తించిన ప్రభుత్వం పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సమర్పించిన నివేదికపై కలెక్టర్ స్పందించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మిల్లర్లకు టార్గెట్ పెంచినట్లు తెలియ జేశారు. దీంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు కళ్లాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు చేసి బుధవారం నుంచి మిల్లులకు తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు కనిపించడం లేదా!



మున్సిపాలిటీ మెయిన్‌రోడ్డులో దర్శనమిస్తున్న టీడీపీ ఫ్లెక్సీ

సాలూరు: ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. దీనితో ఎన్నికల కోడ్‌లో భాగంగా రాజకీయ పార్టీల వ్యక్తులు విగ్రహాలు, ఫ్లెక్సీలను మూసి వేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్ రాగానే మున్సిపాలిటీ అధికారులు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగింపు ప్రక్రియ చేపట్టారు. కాగా ఇప్పటికీ ఆంధ్రా – ఒడిశా జాతీయ రహదారి 26లో, సాలూరు మున్సిపాలిటీ సెంటర్‌లోను, కాంప్లెక్స్ సమీపంలో ఇలా పలు ప్రదేశాల్లో చాలా వరకు ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులు తీరు పలు విమర్శలకు తావిస్తుంది. ఇకనైనా అధికారులు ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను సక్రమంగా నిర్వర్తించాలని ప్రజలు సూచిస్తున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

వీరఘట్టం: మండల కేంద్రంలోని రెల్లివీధికి చెందిన గొర్లె కృష్ణ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలు చెక్కును పంచాయతీ కార్యదర్శి వి.రామచంద్రరావు, సచివాలయం–4 కన్వీనర్ బొమ్మాళి హేమలత మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ఎస్.రమేష్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. రాజకీయ నాయకుల ఫొటోలు, పోస్టర్లు ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

26న ప్రజ్ఞా వికాస పరీక్ష

కురుపాం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 26న మండల కేంద్రం కురుపాంలో ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.25 చెల్లించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. 26వ తేదీ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 7671994813, 9441969693 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం:

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాటుల్లో భాగంగా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి హై పవర్ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సదుపాయం, మెడికల్ కిట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్‌ను సకాలంలో పంపించేందుకు పోస్టల్ సిబ్బంది సహకరించాలని కోరారు. ఇంటర్మీడియట్ ప్రాంతీయ తనిఖీ అధికారి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలు, 10 స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనెల 20 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి 7వరకు జరుగుతాయన్నారు. మార్చి 15వ తేదీనుంచి ఏప్రిల్ 4వరకు రాతపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 22,263మంది మంది విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ఎస్.సుభాష్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి డి.మంజుల వీణ, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

25లోగా ఇ–క్రాప్ నమోదు చేయాలి

ఈనెల 25లోగా ఇ–క్రాప్ నమోదు పూర్తిచేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వ్యవసాయ అనుబంధ రంగాల ప్రగతిపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదులో తప్పులున్న పక్షంలో సంబంధిత వ్యవసాయ సహాయకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ శారద, జిల్లా పశుసంవర్థక అధికారి ఆరిక ఈశ్వరరావు, ఉద్యాన శాకాధికారి కేఎస్ఎన్‌రెడ్డి తదితరులున్నారు.

పాఠశాలల సందర్శన

మక్కువ: మండలంలోని కవిరిపల్లి, శంబర జిల్లా పరిషత్ పాఠశాలలను డీఈఓ ఎస్.డి.వి.రమణ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల్లో లెసన్ ప్లాన్స్, ఉపాధ్యాయుల డైరీని పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వచ్చే విద్యా సంవత్సరం టెన్త్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, సిలబస్‌పై ఏ విధంగా ప్రణాళిక రచించాలో వివరించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించిన 7, 8, 9వ తరగతుల సిలబస్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటే, పదవ తరగతిలో మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. కష్టపడి చదువుకుంటే, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశముంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నభోజన వంటకాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సిహెచ్.శ్రీనివాసరావు, ఏపీఓ హరి, ఎంఈఓ వి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈఓ రమణ

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

మక్కువ: మండల కేంద్రంలో మక్కువ మండలం, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెలకూరి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మక్కువ మండలం విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడిగా కిల్లంపూడి నాగేశ్వరరావుతో పాటు, పలువురు కమిటీ సభ్యులు ఎన్నుకోగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా కిల్లంపూడి రాంబాబు, జిల్లా జాయింట్ సెక్రటరీగా కిల్లంపూడి రామకృష్ణ, జిల్లా డైరెక్టర్‌గా పెరుమాల లక్ష్మణరావు, రెండవ డైరెక్టర్‌గా పొట్నూరు లక్ష్మణరావు, మూడవ డైరెక్టర్‌గా తామరపల్లి మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాలబత్తుల అనంతచారి, కోశాధికారి నడితోక మజ్జిగౌరి శంకరరావు, వర్కింగ్ కమిటీ చైర్మన్ ఉమ్మి కూర్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి సామాజిక తనిఖీలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక తనిఖీలు నిబంధనలకు లోబడి, నిర్దేశించిన గడువులోగా నిర్వహిస్తున్నామని జిల్లా సామాజిక (డీఆర్పీ) తనిఖీ ప్రతినిధి రాజేష్ అన్నారు. మండలంలోని నిడగల్లులో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా డీఆర్పీ రాజేష్ మాట్లాడుతూ 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిడగల్లు పంచాయతీలో సామాజిక తనిఖీ బృందం, చేపట్టిన పనులు, పలుపనులకు కొలతలు, ఎం బుక్‌లు తనిఖీ చేసి ఆడిట్ నిర్వహించామని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకూ 14 పంచాయతీల్లో ఆడిట్ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతా 21 పంచాయతీల్లో మార్చి 2 లోగా ఆడిట్ పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ నాగలక్ష్మి, జేఈ కృష్ణ, సాంకేతిక సహాయకుడు డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిడగల్లు చెరువు పనులను డీఆర్పీ రాజేష్‌కు చూపిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ డి. శ్రీనివాసరావు

పలగరలో సీసీ రోడ్ల నిర్మాణం

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామం బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినప్పుడు బీసీ కాలనీ ఏర్పాటునుంచి సీసీ రోడ్ల నిర్మాణాలు లేవని వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే జోగారావును కోరారు. దీనిపై తక్షణం స్పందించిన ఆయన మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు కోరారు. దీంతో కాలనీలో మూడు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. రూ. 4లక్షలవ్యయంతో 118మీటర్ల రోడ్డు, రూ.3.50లక్షలతో 98మీటర్లు, రూ.3లక్షలతో 86మీటర్ల రోడ్లను కాలనీలో నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పర్యవేక్షించారు. దీనిపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బీసీ కాలనీలో వేస్తున్న రోడ్లను పరిశీలిస్తున్న మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఇంజినీరింగ్ అధికారులు

గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేకు రైతులు సహకరించాలి

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్, జగనన్న భూ రక్ష–భూ హక్కు పథకం ద్వారా దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం జోగింపేటలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూత్ సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రమైన సర్వే చేసి రైతులు దీర్ఘకాలం నుంచి ఎదుర్కొంటున్న భూముల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. జోగింపేటలో 809.50ఎకరాల భూమిని రీసర్వే చేయాల్సి ఉండగా ఇంతవరకూ 350 ఎకరా భూమికి చెందిన వివరాలను సేకరించినట్లు చెప్పారు. తాజాగా గ్రౌండ్ ట్రూత్ సర్వే జరుగుతోందని భౌతికంగా నిర్వహిస్తున్న సర్వేకు రైతుల వద్ద భూములకు సంబంధించి లిఖిత పూర్వక పత్రాలుంటే సర్వే సిబ్బందికి సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ చిట్టమ్మ, మండల సర్వేయర్ శంకరరావు, ఆర్ఐ కరుణాకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.